# మనసున్న మనిషి

రచన :
శ్రీ గుత్తుర్తి సోమేశ్వరరావు

ఊరు. ఊరు చివర యేరు. యేరుకి పొడుగ్గా ఎత్తైన గట్టు. గట్టుమీద పెద్ద వేపచెట్టు. చెట్టుదిగువ సింగారమ్మదేవత మండపం. మండపానికెదురుగా మంచినీళ్ళ బావి. ఈ బావినీళ్ళే ఊర్లోవాళ్ళందరూ వాడుతారు.

ఇప్పటికి పదిసంవత్సరము నుండి సింగారమ్మ మండపం ప్రక్కనే చిన్నపాకలో ఒక సన్యాసి బసచేసుకొని ఉన్నాడు. ఆ సన్యాసి ఊరిలో భిక్షమెత్తుకొని జీవిస్తున్నాడు. నిత్యం గంజాయి నిషాలో మునిగి తేలుతుంటాడు.

మొదట ఆ సన్యాసికి తల్లిదండ్రులు పెట్టిన పేరు సన్యాసిరాజు. చివర రాజు అనే పదానికి తగినట్టుగా వయసులో ఉన్నవాడు రాజుగానే బ్రతికాడు. తను కల్లుగీసే కులస్థుడగుట వలన కులవృత్తి కల్లుగీసి అమ్ముతూ డబ్బు సంపాదించి ఒకరికి లక్ష్యం లేకుండా తిరిగాడు. తన భార్య నూకాలమ్మ ఇంటిదగ్గర కల్లు అమ్ముతుండేది. ఆ ఊరిలో మోతుబరిరైతు చంద్రయ్య ఈ నూకలమ్మ వలలో పడ్డాడు, అదే కారణంగా సన్యాసిరాజుకి చివర రాజు అనే పదానికి గ్రహణం పట్టింది. భార్య ముందు పట్టి సన్యాసి అయ్యాడు. నూకాలమ్మ, చంద్రయ్య ఇంట్లో పండుకుంటే సన్యాసి బయట పడుకుండేవాడు, అయినా భరించాడు. తన బావమర్ది కూడా తనకు ఎదురు తిరిగి, చివరకు తిండిలేకుండా చేసారు. సన్యాసి ఇక సహించలేక పోయాడు. తగిన శాస్తి చెయ్యాలని సన్యాసిరాజులో పగ చెలరేగింది. అదే ధ్యాసతో తిండీ తిప్పలు లేకుండా ఊరిలో తిరుగుతున్నాడు. వంటినిండా నల్లటిదుప్పటి కప్పుకొని, తనకు పరిచయమున్న మనుషు అందరితో "ఒరేయ్, రేపు నూకాలమ్మ పండుగ కదరా! కొమ్ములు మెలితిరిగిన పోతుని బలి చేస్తాను నీకూ మాంసంవాట పంపిస్తాను!" అనేవాడు.

మరునాడు నూకలమ్మ పండుగ బ్రహ్మాండంగా జరుగుతోంది. ఊరిలో ఘటం తిరుగుతోంది, దానితోనే సన్యాసిరాజు తిరుగుతున్నాడు.

ఆ ఘటం సన్యాసిరాజు ఇంటికి వచ్చింది. అప్పుడే ఇంటి ముందర నూకాలమ్మ, చంద్రయ్య ఎదురెదురుగా కూర్చున్నారు, నూకాలమ్మ రద్దీగా కలు అమ్ముతోంది. చంద్రయ్య వీరత్వాన్ని రుజువు చేస్తున్నట్టుగా మీసాలను మెలితిప్పుతూ నవ్వి, తలకంచుకొని పుగాకు చుట్ట చుట్టుకొంటున్నాడు.

ఘటం ప్రక్కనుండి సన్యాసిరాజు దుప్పటి ముసుగుతో చంద్రయ్య ప్రక్కగా వచ్చి, చంద్రయ్య మెడపై ఒక్క వ్రేటు వేసాడు. దానితో చంద్రయ్య తల తెగింది. గుప్పుమని జనం గగ్గోలు పెట్టారు. సన్యాసిరాజు మరలా భార్యపై వ్రేటు వేసాడు నూకాలమ్మ ఒదిరి పోవడం వలన మెడ తప్పి చెయ్యి, కాలు చీరుకు పోయింది. మరిదొరక్కుండా నూకాలమ్మ ప్రక్క సందులోకి పారిపోయింది,

జనమంతా చూసి భయపడి ప్రక్కకు తప్పుకున్నారు. సన్యాసిరాజు పరుగుతీస్తూ పొలంగట్టుకి చేరాడు. కేకలు వేసి అడ్డుపడే వారిని చెలిపేస్తున్నాడు. దూరంలో తన బావమర్ది కనిపించాడు. వాడు ఈ సన్యాసిరాజుని చూసి పరుగు తీసాడు. తను పగతీర్చుకో వల్సిన వ్యక్తుల్లో బావమర్ది ఒకడు గాబోలు, అందుకు ఆ గట్లంబడి పరుగెత్తి సన్యాసిరాజు అలసిపోయాడు.

ఇంతలో ఈ గ్రామస్థులు వచ్చి వెనుకనుండే సన్యాసిరాజుని పట్టుకున్నారు. తను చేసింది నేరమని, తన గ్రామస్థులు తనకు సరియైన తీర్పుఇవ్వక వారిపై కక్ష తీర్చుకున్నానని పోలీస్ స్టేషన్‌కి యదార్థమే చెప్పాడు,

తర్వాత కోర్టులో సన్యాసిరాజుకి జీవితకారాగార శిక్ష వేసారు.

ఇరువై సంవత్సరాల తర్వాత గాంధీజీ శతజయంతి సందర్భంగా పాత ఖైదీలకు సత్ప్రవర్తనను బట్టి సన్యాసిరాజు విడుదలకు విముక్తి కల్గింది,

సన్యాసిరాజు విడుదలై కొంతకాలమైన తర్వాత నెరిసిన తల, గడ్డం మీసాలు సన్యాసిలా పెరిగి ఉన్నాయి. చివరకు ఊరిమీద ఆత్మీయత కల్గి అక్కడకు చేరుకున్నాడు.

సన్యాసికి తెలిసిందేమిటంటే తన భార్య నూకాలమ్మ ఎవరితోనో లేచిపోయి పట్నంలో ఉంటుందన్నారు. అతడేం బాధపడలేదు. ఊరిలో ఆయవరం చేసుకొని,

ఈ సింగారమ్మ మండపం వద్దే ప్రక్క పాకలో బసచేసుకొని ఉంటున్నాడు.

ఆ ఊరిలోకి ఒక పిచ్చిది చేరింది. ఆమె భాష మనకు అర్థంకాదు. మన భాష ఆమెకర్థం కాదు. శరీరంపై పూర్తిగా బట్టకప్పుకోదు. వారూ, వీరూ యిచ్చిన చింపు గుడ్డలు కట్టుకొని, అవి మాసిపోయి, మురికితో మగ్గిపోయి పీలికలు పీలికలుగా ఆమె శరీరంపై వేలాడు తుంటాయి.

కొన్నాళ్ళకు ఈ పిచ్చిగూడ యేటిగట్టునున్న సింగారమ్మ మండపం వద్దనే రాత్రులు పడుకోవడం అదీ చేస్తుంది.

అక్కడే ఉంటున్న సన్యాసికి జాలికలిగి తను తెచ్చుకున్న అన్నం పెట్టేవాడు. పిచ్చిదానికి నచ్చచెప్పి పాక చాటున ఆమెను స్నానం చెయ్యమనే వాడు. చెప్పగా చెప్పగా పోరుపడలేక ఆమె స్నానం చేసేది. తర్వాత తన పంచె ఇచ్చేవాడు. ఆమె కట్టుకోపోతే సన్యాసే పిచ్చిదాని ఒంటినిండా బట్టకప్పేవాడు.

ఆ పిచ్చిది ఇష్టమున్నంత సేపు అక్కడ ఉండేది. బుద్ధికి పిచ్చెక్కగానే ఊరిలోకిపోయి రోడ్ల మీద, వీధుల్లోను దొరికిన అరటితొక్కలు, హోటల్ ముందు పారేసిన ఆకులు నాకుతూ ఉండేది. మరలా ఆ సన్యాసి భోజనం పెడుతున్న వేళకు అక్కడకు వచ్చేది. సుష్టిగా భోంచేస్తుండేది.

మంచినీళ్ళ బావి దగ్గరకొచ్చిన అమ్మలక్కలు అది చూసి, "ఒసే గంగమ్మా! ఆ పిచ్చిదాన్ని ఆ సన్నాసిగాడు అంతయిదిగా చూస్తున్నాడు ఏమిటంటావ్?" అంది అప్పయ్యమ్మ.

"అవునే అప్పయ్యమ్మా! నీకింకా తెలీదుగాబోలు మొన్న దానికి స్నానం చేయిస్తున్నాడు. మగోడు సిగ్గు లేదు గానెలాగు!" అంది రమణమ్మ.

విజయ నీరునిండిన లేక బావినుండి బయటికి తీసి, "కడుపునిండా తిండి పెడుతున్నాడు. ఒంటినిండా బట్ట కప్పుతున్నాడు. పుప్పాకారం తింటున్నవాళ్ళు ఊరకుంటారేమిటి!?" అంది.

"అవునేవ్ విజయా! ఏమన్నా ఉన్నాదంటావేమిటి?" ఇలా బావిదగ్గర ఒకరికొకరు ఊసులాడుకున్న అమ్మలక్కల ప్రభావం నెలరోజుల యేసరికి సన్యాసికి పిచ్చిదానికి అక్రమ సంబంధం ఉన్నదని అందరికీ తెలిసిపోయింది.




ఆంధ్రా మరియు ఒరిస్సా జిల్లాలకు ఏజెంట్లు:
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం.

చూసింది ఎవరంటే!? అందరూ 'టా' బోగాట్టాలే గాని నిజమని నిరూపించలేక పోయారు. కాని, ఆ పిచ్చిది ఊరిలోకి వచ్చిన సమయంలో రిక్షాడ్రైవర్లందరూ గుమిగూడి 'ఒరే పిచ్చిదానికి కడుపు కొంచెం బయటకు పొంగినట్టుంది గదూ? అవున్రా ఇది ఆ సన్యాసిగాడు చేసిన పనేరా పాపం? పిచ్చిదాన్ని అన్యాయం చేసాడ్రా! ఈ సంగతి ఇలాగే వదిలేయకూడదురోయ్. కర్ణం, మునసబు, ప్రెసిడెంటులతో చెప్పి ఆ సన్యాసిగాడిదికి తగిన శాస్తి చేయించాల్రా!' అని వాళ్ళు నిర్ణయించుకున్నారు, అన్నంతపనీ చేసారు.

పెద్దల సమక్షంలోకి సన్యాసిని పిలిపించారు.

"ఒరే సన్నాసీ! ఆ పిచ్చిదాన్ని పాడుపని చేసావా లేదా?" అడిగాడు కరణం.

"ధర్మప్రభువులు మీరు నేను ఏవిధంగా చెంప్పమంటారు నిజం చెప్తే నమ్ముతారా?" అన్నాడు సన్నాసి.

"చఫ్, పిచ్చిగా పేలుతున్నావ్ మాతో అబద్ధం చెప్పి నమ్మిద్దామనుకుంటున్నావా?" అడిగాడు మునసబు.

"ఆ పిచ్చిది సరైన తిండిలేక, సదుపాయం లేకుండా ఉండేది. నా బసకు చేరగానే తిండి తృప్తిగాతిని, ఒంటినిండా బట్టకడుతుంది. అంతేగాని ఆమెలో మరో మార్పులేదు" అన్నాడు సన్యాసి.

"మన ఊరందరి కళ్ళనే కప్పుదామని చూస్తావురా! పిచ్చిదాని కడుపు అంత ఎత్తుగా కనపడితే తృప్తిగా తింటుందంటున్నావు. నీ మాట మాకు లెక్కలేదు. ఆ పని నువ్వే చేసావుగనుక దాన్ని నీకే పెళ్ళి చేసేస్తాం" మన్నారు ప్రెసిడెంటు.

బనియన్ల తయారింపులో
మా ప్రత్యేక తయారింపులు
★ గాయత్రి ఫైన్_సరైన కొలత
★ విస్తా ఫైన్_సరైన కొలత
★ T.N.H స్పెషల్_సరైన కొలత
★ హాంక్ కాంగ్_(రీసైజు)
★ నైలాన్ బనియన్లు (రీసైజు)




తయారించువారు:
ది నంజప్పా హొజయిసరీస్ తిరుపూరు_2

ఆంధ్రా మరియు ఒరిస్సా జిల్లాలకు ఏజెంట్లు :
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం.


సన్యాసి చేసేది లేక విరక్తిగానవ్వి, "ఆనాడు నా భార్య చంద్రయ్యతో అక్రమ సంబంధం ఉంది దీనికి తగిన తీర్పుఅడిగితే మీరంతా నోరు మూసుకున్నారు. సరే, నాపగ నేను తీర్చుకున్నాను. తర్వాత నా భార్య ఎవడితోనో లేచిపోతున్నప్పుడు ఏమైనారు మీ రంతా? కళ్ళార చూసిందానికే మీరు మంచి తీర్పు ఇవ్వలేదు, నేడు ఒక గతిలేని పిచ్చిదాన్ని పట్టుకొని నిజం తెలియకుండా ఉద్ధరించే మహానుభావులు బయల్దేరారు." కసిగా మాట్లాడాడు.

"ఈ సన్యాసి, పిచ్చిదాన్ని ఎలా పెళ్ళి చేసుకోడో మేం చూస్తాం! ఆ పని మామీద వదిలెయ్యండి బాబూ! పంతులయ్యనడిగి ఓ మంచి రోజున గుళ్లో ఆ పిచ్చిదానికి సన్యాసికి పెళ్ళి చేసేద్దాం" అన్నారు రిక్షావాళ్ళంతా.

రిక్షావాళ్ళు ఇదే అదనను కొన్నారు. పెళ్ళిఖర్చులకి, సంతర్పన కోసం ఊరిలోకి చందాలుకై బయల్దేరి వసూలు చేసారు.

కొద్ది డబ్బుతో ఒక మంచిరోజున సన్యాసికి, పిచ్చిదానికి గుళ్లో పెళ్ళిచేయించి, రిక్షాపై కూర్చోబెట్టి ఊరంతా త్రిప్పారు. మిగిలిన డబ్బుతో వంటలు ఏర్పాటు చేసి, ఆ ఊరిలో అడుక్కునే వాళ్ళు తృప్తిగా భోంచేసి త్రేన్చారు.

ఇంత మంచి పని చేసినందుకు పురప్రముఖులు ఒక వేదిక ఏర్పాటు చేసి రిక్షాయూనియన్ ప్రెసిడెంటుకి శాలువా కప్పి సన్మానం చేసారు.

సన్యాసి విధికి లొంగిపోయి, తాళి కట్టిన పిచ్చిదాన్ని భార్యగానే చూసుకుంటున్నాడు. ఇప్పటివరకు గంజాయి నిషాలో మునిగి తేలుతున్న సన్యాసి సంసార సౌఖ్యం అనుభవించేసరికి రెండు నెలలు గడవగానే ఆవేసం, దగ్గు ప్రవేశించింది. కాళ్ళు, చేతులు పీకుతో నడవలేని పరిస్థితిగా తయారైంది సన్యాసి బ్రతుకు. దగ్గుతో రక్తంగూడ పడుతుంది. తన బ్రతుకు అన్యాయం అయిందని గ్రహించిన వ్యక్తి ఒక్కరు గూడా దగ్గరకు చేరలేదు, కనీసం మందులుగాని, డాక్టరుకి చూపించడంగాని చేయలేదు.

అప్పటి నుండి పిచ్చిదానికి సరిగ్గా తిండిలేక కడుపు తీసుకుపోయింది. ఆ సన్యాసిని వదలి మామూలు పిచ్చిదానిలా ఊరిలో తిరుగుతుంది.

ఒక రోజున సన్యాసి రక్తకక్కుకొని దిక్కులేని చావుచచ్చాడు. అప్పుడు పెద్దలకు హిందూ ధర్మంగా సన్యాసి భార్య గుర్తొచ్చింది.

పట్నంలో ఉన్న భార్య వచ్చి, మొసలి కన్నీరు కార్చి అంత్యక్రియలు జరిపించింది. సూతాలమ్మ పాడయిపోయి, ధర్మం తప్పినా పర్వాలేదు. కాని, ధర్మం ప్రకారం నుదుటిపై బొట్టుని తుడుచుకొని బాధ (బాధ్యత) నేటితో తీరిందని పట్నం పోయింది.

★

కొడుకు :__అమ్మా సాకీ రొట్టెవద్దు, బాగాలేదు.
తల్లి :__అయితే ఆ పక్కవు ఇచ్చేయ్.
కొడుకు :__అదీ తినదు.
తల్లి :__అయితే మీ నాన్నకు ఇవ్వు.

__పి. మంగపతి, తిరుపతి.

♦ ♦ ♦

తల్లి :__ఎందుకురా ఏడుస్తున్నావు? ఎవరు కొట్టేరు?
కొడుకు :__కాంగో ఎక్కడుందో మరిచిపోయానని మాస్టరు కొట్టేరు.
తల్లి :__మతిభ్రష్ట వెధవా! బాగా వెతుక్కో ఎక్కడ పారేశావో!

__ఎం. విశ్వనాథ శాస్త్రి, నంద్యాల.

♦ ♦ ♦

రామం :__మబ్బుగా వుందిరా, ఆకాశంమీద ఒక తారా కూడ కన్పించటం లేదు.
రమణ :__అన్నీ సినిమాలకు బుక్కయి పోయాయిరా!

__సి. హెచ్. సుబ్బారావు, ఆదోని.